www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

చిత్తూరు

శనివారం | 12-10-2024 | పేజీలు: 12 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 178 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | తిరుపతి

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తిరుమలలో చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి




తిరుమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాల కట్ల బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం జరగనున్న చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, ఆ తర్వాత చక్ర స్నానం నిర్వహిస్తారు. దీనికోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరిణిలో గ్యాలరీలు, స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. భద్రతాపరంగా ఇబ్బందులు లేకుండా టీటీడీ భద్రతా సిబ్బందితో పాటు ఎస్‌పీఎఫ్ సిబ్బంది, ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. చక్ర స్నానం పవిత్రత రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనం పాటించి పుష్కరిణిలో స్నానం చేయాలని టీటీడీ కోరింది. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఇక, శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించే వరాహస్వామి ఆలయ ప్రాంగణంలో 1,200 కిలోల పుష్పాలు, 10 వేల కట్‌ఫ్లవర్స్‌తో అలంకరణలు చేపట్టారు.

మహారథంపై మహామూర్తి

భక్తి శ్రద్ధలతో భక్తులు తాళ్లతో లాగుతుండగా, మహారథంపై దేవేరులతో కలిసి నాలుగు మాడవీధుల్లో మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు మొదలైన రథోత్సవం.. 9.35 గంటల వరకు సాగింది. ఇక, రాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి వాహనమైన అశ్వవాహనంపై మలయప్పస్వామి కల్కి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చివరిదైన ఈ వాహన సేవకు భక్తులు తరలిరావడంతో గ్యాలరీలన్నీ నిండిపోయాయి. శనివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తవుతాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

- కల్కిగా రాత్రి అశ్వవాహనంపై శ్రీవారి దర్శనం
- నేటి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పూర్తి



భారీ భక్తజన సందోహం మధ్యన మహారథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి



పనితీరు మార్చుకోకుంటే చర్యలు

- ఆరిమాకుపల్లె పీహెచ్‌సీ సిబ్బందిపై ఎంపీ ఆగ్రహం



ఆరిమాకుపల్లె పీహెచ్‌సీలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 11: పని తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఆరిమాకుపల్లె పీహెచ్‌సీ సిబ్బందిపై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎస్ ఆర్‌పురం, ఆరిమాకుపల్లె పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఆరిమాకుపల్లె కేంద్రంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడం చూసి అసహనం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఇక్కడికొచ్చే రోగులను తమిళనాడు ప్రైవేట్ ఆస్పత్రికి పంపుతున్నారన్న సమాచారం తనకుందంటూ మందలించారు. హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. వైద్యులు విధుల్లో లేకపోవడాన్ని తప్పుపట్టారు. ఇలాగే వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలకు ఆదేశించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఎస్‌ఆర్‌పురం ఆయుష్మాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఎంపీ దృష్టికి వైద్యులు తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఎంపీ వెంట టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ, టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, నాయకులు పత్తి గుణశేఖర్ నాయుడు, బాలు, గుండయ్య, శ్రీధర్ యాదవ్, కుమార్, జయచంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, సిద్ధయ్యశెట్టి, నాగారాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీకి రూ.6.81కోట్ల రాబడి

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 11: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రికార్డుస్థాయిలో భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమల కొండకు రాకపోకలు సాగించారు. ఈ మేరకు ఉత్సవాల ఏడు రోజులకుగాను 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 13,566 ట్రిప్పులతో 3,68,626మంది.. తిరుమల నుంచి తిరుపతికి 13,633 ట్రిప్పులలో 4,82,189 మంది ప్రయాణించారు. మొత్తం 8,50,815మంది రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో రాబడి కూడా దాదాపు రూ.6.81కోట్లు సమకూరింది.

'లాటరీ' కిక్కెవరికో?

- 104మద్యం షాపులకు 2241దరఖాస్తులు
- పాలసముద్రంలో ఏకైక దుకాణానికే 82
- ప్రభుత్వానికి రూ.44.82 కోట్ల ఆదాయం

చిత్తూరు సిటీ, అక్టోబరు 11 : మద్యం దుకాణాలకు దరఖాస్తుల పర్వం ముగిసింది. 104 మద్యం దుకాణాలకు 2241 దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ.44.82 కోట్ల ఆదాయం వచ్చింది.రాష్ట్ర సరిహద్దులోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి. అత్యధికంగా పాలసముద్రం మండలానికి కేటాయించిన ఒకే ఒక్క మద్యం దుకాణానికి 82 దరఖాస్తులు వచ్చాయి.గుడిపాల మండలంలో రెండు దుకాణాలకు 36, 32, యాదమరి మండలంలో మూడు దుకాణాలకు 27,43, 27, వెదురుకుప్పం మండలంలో రెండు దుకాణాలకు 37, 34, విజయపురం మండలంలో 4 దుకాణాలకు 33,28,35,28 దరఖాస్తులు, కుప్పంలో 5 దుకాణాలకు 31,32,37,31,35 దరఖాస్తులు, గుడుపల్లెలో ఒక దుకాణానికి 40 దరఖాస్తులు వచ్చాయి. 14వ తేదీన లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు జరగనుంది. చిత్తూరు - కాణిపాకం రోడ్డులోని సంతపేటలో ఉన్న ఆర్‌ఆర్ గార్డెన్స్ (మాణిక్యమ్మ ఫంక్షన్ హాల్)లో 14వ తేది ఉదయం 8 గంటలకు లాటరీ నిర్వహిస్తారు. దరఖాస్తుదారులు ఉదయం7గంటలకు వేదిక వద్దకు చేరుకోవాల్సి వుంటుంది.లాటరీలో లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు సంవత్సరంలో 6విడతలుగా లైసెన్స్ ఫీజును కట్టుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఒక్కరోజు వ్యవధిలో మొదటి విడత లైసెన్స్ ఫీజు చెల్లించాలి. ఆ వెంటనే 16వ తేదీ నుంచి మద్యం దుకాణాలు తెరుచుకుంటాయి. లైసెన్స్ గడువు రెండు సంవత్సరాలుగా నిర్ణయించారు. రెండో సంవత్సరం లైసెన్స్ ఫీజులో 10 శాతం అదనంగా కట్టాల్సి ఉంటుంది.

నియోజకవర్గం	మద్యం దుకాణాలు	దరఖాస్తులు	సగటు
చిత్తూరు	16	424	26.5
జీడీనెల్లూరు	14	416	29.7
పూతలపట్టు	19	464	24.4
పుంగనూరు	19	202	10.6
పలమనేరు	15	195	13
కుప్పం	10	320	32
నగరి	11	220	20
మొత్తం	104	2241	21.54

పల్లె పండుగకు రూ.71.2 కోట్ల మంజూరు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 11: వైసీపీ పాలనలో పంచాయతీలకు పైసా విదల్చకపోగా.. కేంద్రం నుంచి వచ్చిన నిధులను సైతం పక్కదారి పట్టించడంతో పల్లెల ప్రగతి మరుగున పడిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలా పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. పండుగ వాతావరణంలో శంకుస్థాపనలు చేసి, 2025 ఏడాది జనవరి నాటికి పనులు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గురు, శుక్రవారాల్లో డీపీవో లక్ష్మి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలకు మార్గదర్శకాలు జారీచేశారు. రూ.71.2 కోట్లతో 584 పనులు చేపడుతున్నామని డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. తొలిదశలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, పాఠశాలల ప్రహరీలు, రహదారులు, డ్రెయిన్‌ల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తున్నారు. కొత్తగా మంజూరైన గోకులాలు, పంటకుంటలు తదితరల పనులు కూడా పట్టాలెక్కనున్నాయి. కొన్ని ప్రాంతాల్లో తాగు నీరు, విద్యుత్ పనులను కూడా చేపట్టనున్నారు.

గ్రామ సభల నిర్ణయాలతో..

జిల్లావ్యాప్తంగా 697 పంచాయతీల్లో గతనెల 14న నిర్వహించిన గ్రామ సభల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులు, స్థానికుల నుంచి అభిప్రాయ సేకరణ జరిగింది. వచ్చిన వినతులు, అర్జీలపై చర్చించిన అనంతరం ప్రాధాన్యతా క్రమంలో కొన్ని పనులకు పాలకవర్గ సమావేశాల ద్వారా తీర్మానాలు చేశారు. ఉపాధి హామి మెటీరియల్ కాంపొనెంట్ పనుల ఆధారంగా జిల్లాలో 584 పనులకు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం ఆమోదముద్ర వేసి రూ.71.2 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను వారం వ్యవధిలో ప్రారంభించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

తక్కువ ధరకే పామోలిన్, సన్‌ఫ్లవర్ ఆయిల్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 11: దసరా పండుగ సందర్భంగా రేషన్ కార్డుదారులందరికీ తక్కువ ధరకే శుక్రవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పామోలిన్, సన్‌ఫ్లవర్ ఆయిల్, టమోటా, ఉల్లిపాయల అమ్మకాలు చేపట్టినట్లు డీఎస్వో శంకరన్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనలతో రేషన్ దుకాణాలు, రిలయన్స్ వంటి మాల్స్‌లో ఎంపిక చేసిన హోల్‌సేల్, రీటైల్ షాపుల్లో లీటరు పామోలిన్ రూ.110, సన్‌ఫ్లవర్ రూ.124కి విక్రయాలు చేపట్టామన్నారు. ఒక రేషన్ కార్డుపై మూడు లీటర్ల పామోలిన్, లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ ఇస్తున్నట్లు చెప్పారు. రైతు బజార్‌లో టమోటా, ఉల్లిని రాయితీ ధర్పై అమ్మకాలు చేపట్టామన్నారు. ప్రస్తుతం చిత్తూరులో ఏడు.. నగరి, పలమనేరు, కుప్పంలో ఒక్కొక్కటి చొప్పున షాపుల్లో తక్కువ ధరకే విక్రయాలు చేస్తున్నామని తెలిపారు. శనివారం నుంచి షాపుల సంఖ్య 19కి పెంచుతామన్నారు. రేపు, ఎల్లుండి నుంచి మరికొన్ని షాపులు పెంచేందుకు హోల్‌సేల్ డీలర్లతో చర్చలు జరిపామని వివరించారు.

మహిషాసురమర్ధిని అలంకారంలో బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె, అక్టోబరు11: దసరా ఉత్సవాల్లో శుక్రవారం మహిషాసురమర్ధినిదేవిగా బోయకొండ గంగమ్మ దర్శనమిచ్చారు.అమ్మవారికి రెండు చేతుల్లో శంఖుచక్రాలు, మరో రెండు చేతుల్లో విల్లంబులు, మరో చేతిలో ఖడ్గం, ఇంకో చేతిలో డాలు, మరో చేతిలో గద, ఇంకో చేతిలో త్రిశూలంతో అలంకరించి సింహంపై అధిష్ఠింపజేశారు. యాగశాల వద్ద అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి కలశ స్థాపన చేశారు. అనంతరం ఉభయదారులచే అమ్మవారి మూల మంత్రాన్ని పఠింపజేస్తూ మహా గణపతి, ఆదిత్యాది నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర, రుద్ర హోమాలు నిర్వహింపజేశారు. ప్రమీల, అయ్యప్పన్, వాణి, నరేష్, లలితమ్మ, రవీంద్ర, శర్మ, లక్ష్మీప్రియ, గోవర్ధన్, శృతి, దిలీప్, చంద్రారెడ్డి, రమాదేవి, వెంకటరమణరాజు, లక్ష్మి, గౌతమ్, భాగ్యలక్ష్మి, బాలాజి, ధనలక్ష్మి, శివకుమార్, సరస్వతి, నరసింహమూర్తి, వనజారెడ్డి, చిన్నపరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

ప్రయాణికులకు పోలీసుల 'దండం'



వెదురుకుప్పం, అక్టోబరు 11 :పోలీసులు చెయ్యెత్తి ఆపగానే ఆ లగేజీ ట్రక్కులో ప్రయాణిస్తున్నవారికి గుండెలు అదిరిపోయాయి. డ్రైవర్ సంగతి అయితే చెప్పనవసరం లేదు. పైగా ఆపింది ఎస్‌ఐ. కోటింగ్ తప్పదనుకున్నారు. ఆగిన వాహనంలో కిక్కిరిసిపోయి ఉన్న జనం భయం భయంగా చూస్తుండగా ఎస్‌ఐ, కానిస్టేబుల్.. రెండు చేతులూ జోడించారు.ఇటువంటి ప్రయాణాలు ప్రాణాలు తీస్తాయనీ, కుటుంబాలు కన్నీటిపాలు అవుతాయనీ వివరించారు. ఇంటి దగ్గర వారికోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులను తలచుకుని భద్రతకు ప్రాధాన్యం ఇవ్వండంటూ ప్రాధేయపడ్డారు. మరోసారి ఇలా లగేజీ వాహనంలో ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని డ్రైవర్‌ను హెచ్చరించారు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఈ దృశ్యం అక్కడివారినంతా ఆశ్చర్యపరిచింది. వాహనాలను కానిస్టేబుల్‌తో కలిసి తనిఖీ చేస్తున్న కార్వేటినగరం ఎస్‌ఐ రాజ్‌కుమార్ ఇలా వ్యవహరించారు. ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఎస్ఈ కార్యాలయానికి అధికారుల కేటాయింపు

చిత్తూరు సిటీ, అక్టోబరు 11: జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయానికి 13 మంది అధికారులను కేటాయించారు.ఎంఅండ్‌పీ విభాగాన్ని ఎంఆర్‌టీగా మార్పుచేసి.. ఈఈ వాసుదేవరెడ్డిని కొనసాగించారు. కన్‌స్ట్రక్షన్ సెక్షన్ ఈఈగా అమర్ బాబు, టెక్నికల్ విభాగం ఈఈగా జగదీష్, డీపీఈ ఈఈగా షణ్ముగం, పీవోగా రెడ్డెప్ప, ఏవోగా ప్రసన్న ఆంజనేయులు, ఏఏవోగా శివకుమారి, కన్‌స్ట్రక్షన్ డీఈ-1గా మాధవరావు, డీఈ-2గా జ్ఞానేశ్వర్, హెచ్‌టీఎం సీటీఎం సెక్షన్ డీఈ-1గా కమలాకర్ రావు, డీఈ-2గా సిరాజుద్దీన్, ట్రాన్స్‌ఫార్మర్ అండ్ ప్రొటెక్షన్ డీఈగా ప్రభాకర్, ఎల్‌టీఎం, ఎస్‌పీఎం డీఈగా రవిని నియమించారు.



మహిషాసుర మర్ధినిగా కనకదుర్గ



పలమనేరు, అక్టోబరు11 : పలమనేరు పాతపేట కనకదుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణలకు రిటైర్డు హెల్త్ ఆఫీసర్ బి.మునీంద్ర, వి.ఎం. రత్నమ్మ, ఎం. హరికృష్ణ, జి.వాసు, కొండమ్మ, ఆర్.మొగిలప్ప ఉభయదారులుగా వ్యవహరించారు. శుక్రవారం రాహుకాల పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

విశాలాక్షిగా దుర్గమ్మ

వి.కోట : వి.కోటలో వెలసిన దుర్గమ్మ విశాలాక్షిగా భక్తులను కరుణించారు. అమ్మవారి చీరలకు ఆలయ కమిటీ వేలం పాట నిర్వహించారు.

ముత్యాల అలంకరణలో కన్యకాపరమేశ్వరి



కల్లూరు, అక్టోబరు11: కల్లూరులో కొలువైన కన్యకాపరమేశ్వరి ఉదయం ముత్యాల అలంకారంలో, రాత్రి అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. దేవళం పేట శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కాశీవిశాలాక్షి, కువరపల్లిలోని నల్లగంగమ్మ అమ్మవారు ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించారు.

తమలపాకుల అలంకరణలో కన్యకాపరమేశ్వరి



రామకుప్పం, అక్టోబరు 11: రామకుప్పం మండలం ఆనిగానూరులో తమలపాకుల అలంకారంలో, రామకుప్పంలో లలితాదేవి పత్తి అలంకారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కంబాల దేవులపల్లె సప్తమాతృక చౌడేశ్వరి ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు పసుపుఅలంకరణలు చేశారు.

కూర్మాయిపురంలో తాగునీటి సమస్య పరిష్కారం

కుప్పం, అక్టోబరు11: కుప్పం పురపాలసంఘం 14వ వార్డు కొత్తపేట కూర్మాయిపురంలో టీడీపీ యూనిట్ ఇన్చార్జి అప్పు ముఖేష్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ సమస్యపై ఆయన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కు విన్నవించారు. ఎమ్మెల్సీ ఆదేశాలమేరకు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కొత్త తాగునీటి పైప్‌లైన్ వేయించి, కుళాయిలు బిగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం
- ఒకరికి తీవ్రగాయాలు

రామకుప్పం, అక్టోబరు 11: రామకుప్పం మండలం బూరుగుమాకులపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ... బూరుగుమాకుపల్లెకు చెందిన గంగప్ప(66) ద్విచక్రవాహనంలో కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్‌కు వెళ్లి ఎస్.గొల్లపల్లెకు చెందిన సోమప్ప(49)తో కలిసి తిరుగుప్రయాణం అయ్యాడు. కుప్పం వైపు నుంచి వస్తున్న బొలెరో లగేజీ వాహనం బూరుగుమాకులపల్లె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. వెంటనే వారిద్దరూ రోడ్డుపై పడిపోయారు. ఇద్దరికీ తలలపై తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపై పడిన వెంటనే గంగప్ప అపస్మారకస్థితికి చేరుకున్నాడు. గాయపడ్డ ఇద్దరిని బూరుగుమాకులపల్లె గ్రామస్థులు 108వాహనం ద్వారా కుప్పం ఆసుపత్రికి తరలించారు. గంగప్పను పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా సోమప్ప పరిస్థితి నిలకడగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు గంగప్ప సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దాదేపల్లెలో ఇరు పార్టీల ఫ్లెక్సీల చింపివేత

చౌడేపల్లె, అక్టోబర్11: టీడీపీ, వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు చింపివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. దాదేపల్లెలో మహ్మద్‌గని ఆధ్వర్యంలో టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా వైసీపీ నాయకులు కూడా దాదేపల్లెలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. టీడీపీ ఫ్లెక్సీ చింపేసి, వాటి స్థానంలో వైసీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని టీడీపీ నాయకులు వైసీపీ ఫ్లెక్సీ చింపేశారు. దీంతో వాగ్వాదాలు చేసుకున్నారు. టీడీపీ మైనార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దిరెడ్డి జన్మదిన వేడుకల్లో పూర్వ వైసీపీ కౌన్సిలర్



కుప్పం, అక్టోబరు 11: కుప్పంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో పూర్వ వైసీపీ కౌన్సిలర్, ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న సయ్యద్ అలీ పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. కుప్పం మున్సిపాలిటీ 24వ వార్డునుంచి వైసీపీ తరఫున పోటీచేసి కౌన్సిలర్‌గా గెలిచిన సయ్యద్ అలీ మరో నలుగురు ఆ పార్టీ కౌన్సిలర్లతో కలిసి ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఇప్పుడు ఆయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో కనిపించిన నేపథ్యంలో అసలు నాడు టీడీపీలో చేర్చుకున్న కౌన్సిలర్ల చిత్తశుద్ధిపైనే టీడీపీ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇకమీదటైనా చేరికలు ఆచితూచి చేయాలని అధిష్ఠానాన్ని కార్యకర్తలు కోరుతున్నారు.

చెస్ పోటీలకు పుంగనూరు విద్యార్థులు

పుంగనూరు, అక్టోబరు11: ఈనెల 15నుంచి 17 వరకు గుంటూరులో జరిగే అండర్-15 విభాగంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా నుంచి పుంగనూరు విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక గురుకులం చెస్ క్లబ్ కోచ్ మణికంఠ తెలిపారు. శుక్రవారం తూర్పుమొగసాల మున్సిపల్ స్కూల్ ఆవరణలో పుంగనూరు లయన్స్‌క్లబ్ నోబుల్, గురుకులం చెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అండర్-15 చెస్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో స్థానిక జడ్పీబాలికోన్నత పాఠశాలకు చెందిన ఎ.నవ్యశ్రీ, ఎస్.రోహిత, కె.సాయినవ్యశ్రీ, ఎస్. జాహ్నవి, బాలుర విభాగంలో గూడూరుపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎం.సతీష్, టి.గౌతమ్, టి.హరీష్ నాగ, ఓపెన్ విభాగంలో కొత్తయిండ్లు హైస్కూల్ విద్యార్థి వినయ్‌కుమార్‌లు ప్రతిభ కనబరిచారు.

ఆటో ఢీకొని మహిళ మృతి



పుంగనూరు రూరల్, అక్టోబరు 11: పుంగనూరు మండలం ఈడిగపల్లెలో శుక్రవారం రాత్రి ఆటో ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. జనార్ధన్ భార్య లక్ష్మమ్మ(55) భర్త చనిపోవడంతో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కుమారుడు మృతి చెందడంతో కోడలు వరలక్ష్మితో కలిసి ఉంటోంది. రోడ్డుపై ఉన్న మందుల షాపులో మాత్రలు తీసుకుని రోడ్డు దాటుతుండగా ఆటో ఆమెను ఢీకొంది. లక్ష్మమ్మ తలకు తీవ్రరక్తగాయం కాగా చేయి విరిగింది. అపస్మారకస్థితిలో ఉన్న లక్ష్మమ్మను మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాళికాదేవిగా సల్లాపురెమ్మ



భైరెడ్డి పల్లె, అక్టోబరు 11 : భైరెడ్డి పల్లెలో వున్న సల్లాపురెమ్మ ఆలయంలో అమ్మవారు కాళికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థంగ్రామంలో వున్న రామచంద్రస్వామి రథోత్సవం శుక్రవారం జరిగింది.











సోమలలో పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు



సోమల, అక్టోబరు 11: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా సోమల బస్టాండ్‌లో కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఎంపీటీసీలు నాగభూషణంరెడ్డి, మహమ్మద్ జిన్నా, హరినాథ్, సర్పంచులు కర్రి వెంకటరమణ, సౌజన్య, కోదండరాజు, సురేంద్ర రెడ్డి, బాషా మసూద్, డిసెంబర్‌రావు, వీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వెన్న అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, అక్టోబరు11: పట్టణంలో విరూపాక్షి మారెమ్మ వెన్న అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు.

అష్టలక్ష్మిగా మలాలమ్మ



గంగవరం, అక్టోబరు 11 : మేలుమాయి క్రాస్‌లో వెలసిన మలాలమ్మ అమ్మవారు అష్టలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు.



పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు

కల్లూరు, అక్టోబరు11: పులిచెర్ల మండలం రాయవారిపల్లి, కమ్మపల్లి పంచాయతీల్లో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో వరి, అరటి పంటకు నష్టం వాటిల్లింది. మూడు రోజుల క్రితం తూర్పు విభాగం అటవీప్రాంతంలోకి వచ్చిన ఏనుగుల గుంపు గురువారం రాత్రి అడవి నుంచి కమ్మపల్లి పంచాయతీ గంటావారిపల్లి సమీపం గుండా పంట పొలాల్లోకి చేరుకున్నాయి. గంటావారిపల్లిలోని రైతు జయరామయ్య వరి పంటను తొక్కుకుంటూ పాశంవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. మాజీ సర్పంచ్ భాస్కర్‌కు చెందిన ఎకరా వరి పంట, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. అనంతరం రైతు హరికి చెందిన అర ఎకరా వరిపంటను తొక్కేశాయి. అక్కడి నుంచి శుక్రవారం ఉదయం అడవి వైపు ఏనుగుల గుంపు వెళ్లినట్లు ప్రజలు తెలిపారు. 16 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన పంటలను మంగళంపేట ఎఫ్‌బీఓ మున్నా పరిశీలించారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

రామకుప్పం, అక్టోబరు 11: ఉన్సిగానిపల్లె పంచాయతీ జౌకుపల్లెలో సీసీరోడ్ల నిర్మాణానికి శుక్రవారం టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణాచారి, అ పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ సర్పంచులు రామ్మూర్తి, మహాదేవి, నేతలు కన్నన్, బాబు, జయశంకర్, కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, మణేష్, శంకర్‌చలం, నాగభూషణం, శంకర్‌చలం, వెంకటాచలం, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నం ప్యాకెట్ల అందజేత

పలమనేరు, అక్టోబరు11 : పలమనేరులోని లారీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిలాని శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి, వివిధ ఆలయాల వద్ద కుటుంబసభ్యులతో కలసి అనాథలకు, వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందజేశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గిరింపేట దుర్గాంబకు పవళింపు సేవ



చిత్తూరు కల్చరల్, అక్టోబరు 11: గిరింపేట దుర్గాంబ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన పవళింపు సేవతో ముగిశాయి. ఆలయ మాజీ పాలకమండలి ఛైర్మన్ వీకే విశ్వనాథ్ ఉభయంతో ఈవో మునిశేఖర్, పాలకమండలి ఛైర్మన్ దిలీప్‌రెడ్డిలు అమ్మవారికి పూజలు చేశారు. చౌడేశ్వరిమాతకు కూడా పవళింపు సేవ నిర్వహించారు. ● తేనెబండ ముత్యాలమ్మ, పొన్నియమ్మ రాజరాజేశ్వరిగా, కట్టమంచి విశ్వసాయి షిరిడీ సాయిబాబా ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు.



కట్టమంచి సాయిబాబా ఆలయంలో మహిషాసుర మర్దినిగా అమ్మవారు

దుర్గాదేవి అలంకారంలో మరగదాంబిక

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 11: కాణిపాకంలోని మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేయగా, సాయంత్రం భక్తుల ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహింపజేసి తీర్థప్రసాదాలు అందించారు. ఈవో గురుప్రసాద్, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి పాల్గొన్నారు.

పాలసముద్రం: బలిజకండ్రిగలోని చెవిటి గంగమ్మ, మణిపురంలోని యల్లమదేవి శుక్రవారం రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

బంగారుపాళ్యం: మొగిలీశ్వర ఆలయంలోని కామాక్షమ్మకు గాజుల అలంకరణ చేశారు. ఉభయదారులుగా నలగాంపల్లెకు చెందిన ఎన్‌పీ అమ్మ తమ్మ, ఎన్‌పీ సుచిత్ర, హంసవేణి కుటుంబీకులు వ్యవహరించారు. అలాగే వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మ, పాత దేరాకండ్రిగలోని నైనేరమ్మ మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు.

నిండ్ర: కేఆర్‌పాలెంలోని మహాలక్ష్మి అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరులోని అల్లియెల్లమ్మను శాకాంబరిగా అలంకరించారు. చాముండేశ్వరి హోటల్ నిర్వాహకుడు సోని ప్రకాష్ కుటుంబసభ్యులు అభిషేకం పూజలకు ఉభయదారులుగా వ్యవహరించగా, నల్లరాళ్లపల్లె వద్ద ఉన్న చూడామణి ఆచారి కుటుంబీకులు ఆలయం వద్ద 500 మంది భక్తులకు అన్నదానం చేశారు.



దుర్గాదేవి అలంకారంలో మరగదాంబిక - రాజరాజేశ్వరిదేవిగా చెవిటిగంగమ్మ - మొగిలీశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మకు గాజుల అలంకరణ - మహిషాసురమర్దిగా కార్వేటినగరం బంగారమ్మ - రాజరాజేశ్వరిదేవిగా కేఆర్‌పాలెంలోని మహాలక్ష్మి - గంగాధరనెల్లూరులో శాకాంబరిగా అల్లియెల్లమ్మ

పవళింపుసేవలో దుర్గమ్మ

గుడిపాల, అక్టోబరు 11: కందగిరికొండలోని దుర్గమ్మకు శుక్రవారం పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, సభ్యులు పూజలు నిర్వహించారు. పల్లూరులో రాజరాజేశ్వరిదేవిగా దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ముట్టుకూరుపల్లెలో మహిషాసుర మర్దినిగా అమ్మవారిని ఏర్పాటు చేసి, పూజలు చేశారు.



ముట్టుకూరుపల్లెలో మహిషాసుర మర్దిని అలంకారం →

జీవరాశుల సంరక్షణకు హోమం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 11: సంతపేట జీజేఎం ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో నవచండీమాత యాగం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం జీవరాశుల సంరక్షణకు హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే తన కుటుంబీకులతో కలిసి యాగంలో పాల్గొన్నారు.

దుర్గాదేవికి పూజలు

విజయపురం, అక్టోబరు 11: జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో శుక్రవారం దుర్గాదేవికి పూజలు చేశారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు రాంప్రసాద్‌శర్మ తీర్థప్రసాదాలు భక్తులకు అందజేయగా, మధ్యాహ్నం అన్నదానం చేశారు.



ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 11: చవటగుంట ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పెరుమాళ్లపల్లె సర్పంచ్ బండి శశి ఆనందరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బోడిరెడ్డి హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పైపులైనుకు మరమ్మతులు

విజయపురం, అక్టోబరు 11: పాతార్కాడులో పైపులైను మరమ్మతులకు గురవడంతో మిట్టవీధిలో తాగునీటి సమస్య తలెత్తింది. స్పందించిన సర్పంచ్ బొబ్బిలి ఈ పైపులైనుకు శుక్రవారం మరమ్మతులు చేశారు.



దసరా శుభాకాంక్షలు

తెలిపిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

చిత్తూరు, అక్టోబరు 11: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయ దశమి అని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య అన్నారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌లు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 11:ఎస్‌ఆర్‌పురం మండలం అరిమాకుపల్లె గ్రామంలోని అరిమాని గంగమ్మకు శుక్రవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదానం ఉభయదారులుగా సిద్దయ్యశెట్టి కుటుంబీకులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, పత్తి గుణశేఖర్ నాయుడు, బాలు, జయచంద్ర నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు హిమాచలపతిరెడ్డి, సిద్దయ్యశెట్టి, జలంధర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంకాళపరమేశ్వరి సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి, అక్టోబరు 11: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తన స్వగ్రామమైన వెంకట్రామాపురంలో గ్రామ దేవత అంకాళపరమేశ్వరికి కుటుంబ సమేతంగా మొక్కులు తీర్చుకున్నారు. బంధువులతోపాటు ఆయన స్వగ్రామంలో అమ్మవారికి పూజలు జరిపి.. వేద పండితుల ఆశీర్వాదం పొందారు.

ఘనంగా రథోత్సవం





అశ్వవాహనంపై శ్రీనివాసుడు - బలరామావతారంలో మహా విష్ణువు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 11: మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరాలయంలో శుక్రవారం రథోత్సవం, అశ్వవాహన సేవ వైభవంగా నిర్వహించారు. అలాగే కోదండరామాలయంలో శ్రీమహావిష్ణువు బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా లక్ష్మీనారాయణుడి రథోత్సవం



గంగాధరనెల్లూరు, అక్టోబరు 11: వేపంజేరిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనారాయణుడి రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి అశ్వవాహనంపై స్వామిని అధిష్ఠింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా చిత్తూరుకు చెందిన పి.బి.పద్మ (అశ్వ వాహన సేవ), హైదరాబాదుకు చెందిన వీజే వెంకటేష్, వీజే మణికంఠ (అభిషేకం, కల్యాణోత్సవం), యూఎస్ఏకి చెందిన రమ్య, మోహిత్, సైలేంద్ర, కల్యాణ్, తిరుపతికి చెందిన డాక్టర్ వేణుగోపాల్ (అన్నదానం) వ్యవహరించారు. ఆలయట్రస్టీ కేఎస్ వాసు, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లకీ సేవలో రాజరాజేశ్వరిదేవి



వెదురుకుప్పం, అక్టోబరు 11: కార్వేటినగరంలో రాజరాజేశ్వరిదేవి శుక్రవారం పల్లకీ సేవలో పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కార్యనిర్వాహకులు మంజునాథ్‌వర్మ, జయంతిరాజు, పద్మనాభరాజు, మురళీకృష్ణవర్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శరన్నవ రాత్రి ఉత్సవాలు





బుగ్గ ఆలయంలో పూజలు - మహిషాసుర మర్దిని అలంకరణలో దేశమ్మ

నగరి, అక్టోబరు 11: దేవీ ఆలయాల్లో శుక్రవారం శరన్నవ రాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. బుగ్గ అగ్రహారం ఒన్నూరమ్మ దేవాలయంలో అమ్మవారు సరస్వతిగా, టీఆర్ కండ్రిగలో దేశమ్మ దేవత మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణ పరిధిలోని కరకంటేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారికి కాళీ అలంకరణ చేశారు. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవికి మహా గౌరి అలంకారం చేశారు.

ముందస్తు పల్లె పండుగ



భూమి పూజ చేస్తున్న గంగయ్య తదితరులు

వెదురుకుప్పం, అక్టోబరు 11: ముందస్తుగా పల్లె పండుగ కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లె పంచాయతీ నెమలగుంటలో శుక్రవారం నిర్వహించారు. సిమెంటు రోడ్డు పనులను భూమిపూజ చేశారు. టీఎన్‌టీయూసీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పోటుగారి గంగయ్య, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, జనసేన నాయకులు కావలి సతీష్, హరినాథ్ పాల్గొన్నారు.

బాధితుడికి వీల్‌చైర్ వితరణ



పెనుమూరు, అక్టోబరు 11: సామిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన అజయ్ ఇంటిపై నుంచి పడిపోవడంతో నడవలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న జనసేన నేతలు ఓ వీల్‌చైర్‌ను శుక్రవారం బాధితుడికి అందజేసి, ధైర్యం చెప్పారు. జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, నేతలు ప్రసాద్, రేణుక, గురుప్రసాద్, రాఘవ, అన్నామలై పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



ఎర్రగుంటపల్లెలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

వెదురుకుప్పం, అక్టోబరు 11: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎర్రగుంటపల్లెలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ప్రసంగించారు. డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి కీటక జనిత వ్యాధులన్నీ దోమకాటుతోనే వస్తాయని చెప్పారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జి.మోహన్‌బాబు, పర్యవేక్షకుడు మోహన్ మురళీనాథ్, ఏఎన్‌ఎం సుధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో విజయదశమి సందడి



జనంతో కిటకిటలాడిన చర్చివీధి

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 11: చిత్తూరు నగరంలో శుక్రవారమే విజయదశమి సందడి నెలకొంది. శనివారం విజయదశమి పండగ సందర్భంగా నగరంలోని చర్చి, బజారు, పొన్నియమ్మ గుడి, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దర్గా, సీబీరోడ్డు జనంతో కిక్కిరిశాయి. బూడిద గుమ్మడి కాయలు, మామిడి, అరటి మండలు, పూలు, పండ్లు, స్వీట్స్ తదితర పూజా సామగ్రిని కొనుగోలు చేశారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న నగరవాసులు

పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల లక్ష్యం / నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్





అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే - పేదలతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, అక్టోబరు 11: పేదల ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని సంత మైదానంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆయన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసి, పేదల పొట్ట కొట్టిందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం చంద్రబాబు పేర్కొన్నట్టు అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం పేదలకు భోజనం వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కమిషనర్ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు గుణశేఖర్, రాజశేఖర్, కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసులు సమక్షంలో ఎమ్మెల్యే అన్న క్యాంటీన్‌ను ప్రారంభించగా, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు జయంతి, బాలాజీ, సురేష్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, కరుణ, జ్యోతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేలపైనే 11 కేవీ విద్యుత్ తీగలు

అధికారులు పట్టించుకోవడం లేదంటున్న రైతులు



పాలసముద్రం, అక్టోబరు 11: పాలసముద్రం కాలనీలో సుబ్రహ్మణ్యం అనే రైతు వ్యవసాయ భూమిలో నేలపైనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. రెండు నెలల కిందట కురిసిన గాలివానకు తీగలు కిందకు ఒరిగాయి. అప్పటి నుంచి వైర్లను సరిచేయాలని అధికారులకు సుబ్రహ్మణ్యం విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు. రెండు విద్యుత్ స్తంభాల మధ్య మరో స్తంభం నాటడానికి రైతు తన సొంత ఖర్చుతో తీసుకొచ్చి గొయ్యి కూడా తీశాడు. అయితే లైన్‌మ్యాన్ మాత్రం నేడు, రేపు అంటూ వాయిదాలు వేస్తున్నాడని, దీనివల్ల పంటల సాగు చేయలేకున్నామని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పొదుపు, బీమా సేవలకు ప్రాధాన్యం

తపాలా శాఖ తిరుపతి డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్



రమేష్ కుటుంబీకులకు చెక్ అందిస్తున్న వసంత, తదితరులు

నగరి, అక్టోబరు 11: చిన్న మొత్తాల పొదుపు, వ్యక్తిగత బీమా కల్పనలో తపాలా శాఖ ప్రాధాన్యమిస్తుందని తిరుపతి డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ వసంత తెలిపారు. తపాలా వారోత్సవాల ముగింపు రోజైన శుక్రవారం నగరి తపాలా కార్యాలయంలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. తపాలా బీమా పాలసీని తీసుకుని ఇటీవల మృతి చెందిన మండలంలోని తడుకుపేటకు చెందిన రమేష్ కుటుంబీకులకు బీమా నగదును చెక్కు రూపంలో అందజేశారు. పుత్తూరు ఐపీవో సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధి చిరంజీవిరెడ్డి, కౌన్సిలర్ దయానిధి, నగరి పోస్టు మాస్టర్‌కవిత, డెవలప్‌మెంట్ అధికారి రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

11 మండలాల్లో వర్షం

చిత్తూరు, అక్టోబరు 11: జిల్లావ్యాప్తంగా అల్పపీడన ద్రోణి కారణంగా గడిచిన 24 గంటల్లో 11 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా.. వెదురుకుప్పంలో 24.4, గుడిపాలలో 20.2, శ్రీరంగరాజపురంలో 12.6, నింద్రలో 11.4, కార్వేటినగరంలో 9.2, తవణంపల్లెలో 9, పాలసముద్రంలో 5.6, నగరిలో 3.6, చిత్తూరులో 3.6, పెనుమూరులో 2.6, పూతలపట్టులో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఎస్ఈ కార్యాలయానికి అధికారుల కేటాయింపు

చిత్తూరు సిటీ, అక్టోబరు 11: జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయానికి 13 మంది అధికారులను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్కిల్ కార్యాలయాల్లో ఉన్న అధికారులను సర్దుబాటు చేసి.. కొన్ని పోస్టులను కుదించారు. ఎంఅండ్‌పీ విభాగాన్ని ఎంఆర్‌టీగా మార్పుచేసి.. ఇదివరకే ఉన్న ఈఈ వాసుదేవరెడ్డిని కొనసాగించారు. కన్‌స్ట్రక్షన్ సెక్షన్ ఈఈగా అమర్ బాబు, టెక్నికల్ విభాగం ఈఈగా జగదీష్, డీపీఈ ఈఈగా షణ్ముగం, పీవోగా రెడ్డెప్ప, ఏవోగా ప్రసన్న ఆంజనేయులు, ఏఏవోగా శివకుమారి, కన్‌స్ట్రక్షన్ డీఈ-1గా మాధవరావు, డీఈ-2గా జ్ఞానేశ్వర్, హెచ్‌టీఎం సీటీఎం సెక్షన్ డీఈ-1గా కమలాకర్ రావు, డీఈ-2గా సిరాజుద్దీన్, ట్రాన్స్‌ఫార్మర్ అండ్ ప్రొటెక్షన్ డీఈగా ప్రభాకర్, ఎల్‌టీఎం, ఎస్‌పీఎం డీఈగా రవిని నియమించారు.

బంగారుపాళ్యం ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీధర్

బంగారుపాళ్యం, అక్టోబరు 11: బంగారుపాళ్యం ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదే కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తుండిన శివశంకర్ అన్నమయ్య జిల్లా పీలేరుకు బదిలీపై వెళ్లారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు

కల్లూరు, అక్టోబరు11: పులిచెర్ల మండలం రాయవారిపల్లి, కమ్మపల్లి పంచాయతీల్లో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేశాయి. దీంతో వరి, అరటి పంటకు నష్టం వాటిల్లింది. మూడు రోజుల క్రితం తూర్పు విభాగం అటవీప్రాంతంలోకి వచ్చిన ఏనుగుల గుంపు గురువారం రాత్రి అడవి నుంచి కమ్మపల్లి పంచాయతీ గంటావారిపల్లి సమీపం గుండా పంట పొలాల్లోకి చేరుకున్నాయి. గంటావారిపల్లిలోని రైతు జయరామయ్య వరి పంటను తొక్కుకుంటూ పాళంవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. మాజీ సర్పంచ్ భాస్కర్‌కు చెందిన ఎకరా వరి పంట, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. అనంతరం రైతు హరికి చెందిన అర ఎకరా వరిపంటను తొక్కేశాయి. అక్కడి నుంచి శుక్రవారం ఉదయం అడవి వైపు ఏనుగుల గుంపు వెళ్లినట్లు ప్రజలు తెలిపారు. 16 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన పంటలను మంగళంపేట ఎఫ్‌బీఓ మున్నా పరిశీలించారు.

దాదేపల్లెలో ఇరు పార్టీల ఫ్లెక్సీల చింపివేత

చౌడేపల్లె, అక్టోబరు 11: టీడీపీ, వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు చింపివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. దాదేపల్లెలో మహ్మద్‌గని ఆధ్వర్యంలో టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా వైసీపీ నాయకులు కూడా దాదేపల్లెలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. టీడీపీ ఫ్లెక్సీ చింపేసి, వాటి స్థానంలో వైసీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని టీడీపీ నాయకులు వైసీపీ ఫ్లెక్సీ చింపేశారు. దీంతో వాగ్వాదాలు చేసుకున్నారు. టీడీపీ మైనార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుపతి జిల్లాకు భారీ వర్షసూచన

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 11: రాబోయే మూడు రోజుల్లో తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈక్రమంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 16 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని కాబట్టి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బియ్యం, కందిపప్పు తదితరాలు తగినంత స్టాక్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ జనరేటర్లను అందుబాటులో వుంచుకోవాలని, శిథిలావస్థ భవనాలు, పూరి గుడిసెల్లో ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

పుంగనూరు రూరల్, అక్టోబరు 11: పుంగనూరు మండలం ఈడిగపల్లెలో శుక్రవారం రాత్రి ఆటో ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. జనార్ధన్ భార్య లక్ష్మమ్మ(55) భర్త చనిపోవడంతో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కుమారుడు మృతి చెందడంతో కోడలు వరలక్ష్మితో కలిసి ఉంటోంది. రోడ్డుపై ఉన్న మందుల షాపులో మాత్రలు తీసుకుని రోడ్డు దాటుతుండగా ఆటో ఆమెను ఢీకొంది. లక్ష్మమ్మ తలకు తీవ్రరక్తగాయం కాగా చేయి విరిగింది. అపస్మారకస్థితిలో ఉన్న లక్ష్మమ్మను మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



హైకోర్టు న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 11: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి, ఐవోసీఎల్ చైర్మన్ సతీష్‌కుమార్, తిరుపతి ఆర్డీసీ చంద్రశేఖర్ ఆజాద్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఈవో గురుప్రసాద్ దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఎస్ఐ ధరణీధర, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్కేటింగ్



స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

వెదురుకుప్పం, అక్టోబరు 11: కార్వేటినగరం మీదుగా పళ్లిపట్టు వైపు శుక్రవారం హైదరాబాదుకు చెందిన కె.రాజేష్‌కుమార్, కె.ఉమేష్‌కుమార్ స్కేటింగ్ చేస్తూ వెళ్లారు. ఈ సందర్భంగా ఆ చిన్నారులు మాట్లాడుతూ.. పుత్తూరులోని టాలెంట్ స్కేటింగ్ అకాడమీ చీఫ్ కోచ్ జి.ప్రతాప్, అసిస్టెంట్ కోచ్ బి.శ్రావణి వద్ద శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీన హైదరాబాదులో జరిగే 300 కి.మీ బ్యాక్ స్కేటింగ్ అండ్ మల్టీ టాస్క్ ప్రపంచ రికార్డు సాధించడానికి పది నెలలుగా శిక్షణ తీసుకుంటున్నారని ప్రతాప్ తెలిపారు. రోజూ ఈ ఇద్దరు సుమారు 80 కి.మీ బ్యాక్ స్కేటింగ్ చేస్తూ 3'3 క్యూబ్‌ని సెట్ చేస్తూ శిక్షణ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం చెన్నై, కార్వేటినగరం, తిరుపతి దారుల్లో కఠినమైన శిక్షణ పొందుతున్నట్లు వివరించారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్

చిత్తూరు, అక్టోబరు 11: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటోడ్రైవర్ల యూనియన్ చిత్తూరుశాఖ కార్యాలయంలో ఆయన ప్రసంగించారు. ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగానే ఆటోడ్రైవర్లకూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. నగర కార్యదర్శి దాసరిచంద్ర, నేతలు రమాదేవి, విజయ్‌కుమార్, రవి, రఘు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.